ఆరోగ్య సంస్థతో టీయూ ఎంవోయూ

డిచ్‌పల్లి (ఇందల్వాయి), ఫిబ్రవరి 10 : తెలంగాణ యూనివర్సిటీ, సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ మధ్య సోమవారం మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) చేసుకున్నారు. అవగాహన ఒప్పంద పత్రాలపై టీయూ వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ చేకూరి ఉదయ సూర్యభగవాన్, ప్రతినిధులు కేదం రాజేంద్రకుమార్, విక్రమ్ సంతకం చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఆర్గనైజేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ లాభాపేక్ష లేని చారిటబుల్ ట్రస్ట్ (స్వచ్ఛంద సంస్థ) అని, ప్రజారోగ్యం, శ్రేయస్సును మెరుగుపర్చడానికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ వైద్యం, స్టూడెంట్ సపోర్ట్ సెంటర్ (ఎస్సెస్సీ) ఏర్పాటు చేసి విద్యార్థి ఆరోగ్య అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. టీయూ వీసీ మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం.. ఆరోగ్య విద్య, కౌన్సెలింగ్ సేవలు, ఫిట్‌నెస్ కార్యకలాపాలతోపాటు విద్యార్థుల్లో మానసిక భావోద్వేగ శారీరక శ్రేయస్సును పెంపొందించడమే ఈ భాగస్వామ్య లక్ష్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ గంటా చంద్రశేఖర్, ఆంజనేయులు, సూర్యస్ హెల్త్ ఆర్గనైజేషన్ సభ్యులు డాక్టర్ రవితేజ ఇన్నమూరి, సైకియాట్రిస్ట్ ఆనంద్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో మానసిక వైద్యులది కీలక పాత్ర

- ప్రముఖ మానసిక వైద్యుడు విశాల్

వర్క్‌షాప్‌లో పాల్గొన్న డాక్టర్ విశాల్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 10 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో మానసిక వైద్యులది కీలక పాత్ర అని, న్యాయవ్యవస్థ, మానసిక ఆరోగ్య రంగాల మధ్య మైత్రిని బలోపేతం చేయడం ద్వారా సమ సమాజాన్ని నిర్మించగలుగుతామని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు విశాల్ అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మానసిక రుగ్మతలపై ప్రసంగించారు. మానసికంగా దృఢంగా ఉంటేనే ఏదైనా సాధించగలమని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి మహ్మద్ షమీమ్, మహ్మద్ ఆసిఫ్, సీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ఇందల్వాయి, ఫిబ్రవరి 10 : మండలంలోని గౌరారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ముక్కెర గంగాధర్ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, తాజా మాజీ సర్పంచ్ ఇమ్మడి లక్ష్మి బాధిత కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో బొల్లారం చిన్న గంగారాం, తొగరి సాయిలు, పల్లికొండ నరేశ్, కమ్మరి రాజు, పల్లికొండ చిన్ననర్సయ్య, ఒడిగె గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలి

వ్యక్తిత్వ వికాస నిపుణురాలు వజ్జా నవనీత

సిరికొండ, ఫిబ్రవరి 10 : విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో, పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న గమ్యాన్ని చేరుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణురాలు వజ్జా నవనీత అన్నారు. మండలకేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడి మహిళా సాధికారతపై చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ గడ్డం రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల్లో చదువుపై మక్కువ పెంచడం, వార్షిక పరీక్షలు రాయడంలో భయాందోళన తొలగించడం కోసం వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణురాలు వజ్జా నవనీత

భావసార్ క్షత్రియ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీవన్ గౌరవ్ పీఆర్ కుమార్

భావసార్ క్షత్రియ (రంగరేజ్) సమాజ్ నూతన కమిటీ ప్రతినిధులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 10 : భావసార్ క్షత్రియ (రంగరేజ్) సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీవన్ గౌరవ్ పీఆర్ కుమార్ నియామకమయ్యారు. సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ జేత్నే, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఇతర బృంద సభ్యులు జిల్లా కేంద్రంలోని హింగుళాంబికా దేవి ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలో భావసార్ క్షత్రియ సమాజ్ ఏకత్ యూనిటీని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలోని 64 సంస్థలను 7 విభాగాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ను రెండో విభాగంగా నిర్ణయించి, ఆయా జిల్లాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జీవన్ గౌరవ్ పీఆర్ కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. అదనపు కార్యదర్శిగా శ్యాసుందర్ గోజే, సంయుక్త కార్యదర్శిగా ప్రభాకర్ దామ్జేవర్, నిజామాబాద్ లోకల్ సమాజ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ యథా విధిగా సంయుక్త కార్యదర్శిగా, సాయినాథ్ జాడేను కార్యవర్గసభ్యునిగా, రాష్ట్ర డాక్టర్ల ఫోరం అధ్యక్షుడిగా డాక్టర్ కిశోర్ సుత్రావేను నియమించారు. సమావేశంలో దిగంబర్‌రావు, పెండ్కర్, రామారావు, లాంసికర్, గోజే భాస్కర్, శ్రీకాంత్, మైస్కర్ సాయి బాబా, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలి

కంఠేశ్వర్, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని, అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేయాలని ఆలిండియా మజ్లిస్ ఇ ఇంక్విలాబ్ ఇ మిల్లత్ (ఏఐఎంఐఎం) రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కుట్టు పనులు వచ్చిన వారు కుట్టుమిషన్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వనందున రైతులు పంటలు పండించడానికి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంటలు పండిస్తున్నారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు రేషన్ కార్డులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ అబ్దుల్ హలీం, జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెండ్లి చెడగొట్టాడని యువకుడిపై కత్తితో దాడి

- వాట్సాప్ గ్రూపుల్లో వెలుగుచూసిన ఫొటోలు
- ముగ్గురిపై కేసు నమోదు

చేతిలో కత్తితో యువకుడు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 10 : నిజామాబాద్ నగర శివారులోని ఓ యువకుడికి పెండ్లి కుదిరిన విషయం తెలుసుకుని మరో యువకుడు అడ్డుపడడంతో రెండు గ్యాంగుల మధ్య పరస్పరం ఘర్షణ చోటుచేసుకొని కత్తి పోట్లకు దారి తీసిన ఘటన ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో చోటుచేసుకున్నది. ఆరోటౌన్ ఎస్సై వెంకట్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సారంగాపూర్ పరిధిలోని సతీశ్‌నగర్ కాలనీలో ఉండే జమీల్ అనే యువకుడికి ఇటీవల ఓ యువతితో పెండ్లి కుదిరింది. ఈ విషయం తెలుసుకున్న ఫెరోజ్ అనే మరో యువకుడు పెండ్లి చెడగొట్టేందుకు యత్నించాడు. దీంతో జమీల్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం ఫెరోజ్ వద్దకు వెళ్లి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఫెరోజ్ చేతికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతడిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన జమీల్‌తోపాటు అతడికి సహకరించిన మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇరు గ్యాంగుల మధ్య జరిగిన ఘర్షణతోపాటు కత్తితో దాడి చేసిన దృశ్యాలను యువకులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, ఆ ఫొటోలను పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేయడం చర్చనీయంశంగా మారింది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రుద్రూర్, ఫిబ్రవరి 10 : మండలకేంద్రంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. ఆరుగురికి రూ. 2.64 లక్షల విలువ చేసే చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నగేశ్, సీనియర్ నాయకులు పత్తి రాము, తోట సంగయ్య, పత్తి లక్ష్మణ్, బాల్‌రాజు, సంజీవ్‌రెడ్డి, ఖాదర్, సాయిలు, ప్రవీణ్, కిష్టయ్య, సంజీవ్, నాగేందర్, నర్సయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇన్‌పేషెంట్ వార్డులో వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఇందల్వాయి, ఫిబ్రవరి 10 : మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ సోమవారం తనిఖీ చేశారు. దవాఖానలోని రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. టీకాలు, వాటిని నిల్వ ఉంచిన రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. గర్భిణులకు చేస్తున్న రక్తపరీక్షలపై ల్యాబ్ టెక్నీషియన్ అనితా రాథోడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దవాఖానను శుభ్రంగా ఉంచాలని అటెండర్లను ఆదేశించారు. రోగులకు రోజూ వారీగా ఇస్తున్న మందుల వివరాలను ఫార్మాసిస్ట్ విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి, గర్భిణితో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి, ఆయుష్ వైద్యురాలు భువన, ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిరికొండ, ఫిబ్రవరి 10 : మండలంలోని కొండూర్ శివారులోని వాగు బ్రిడ్జి వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు ఆర్ఐ గంగరాజం తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామని ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 10 : జాతీయ చేనేత ఐక్యవేదిక జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నగరంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ హాజరై.. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరమోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తోపాటు కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, జిల్లా అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పూల్గం హన్మాండ్లు, పద్మశాలీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్య, గురుచరణం, చంద్రభాగ, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాల విడుదల

సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణ

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 10: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మొదటి సెమిస్టర్ ఫలితాలను తెలంగాణ యూనివర్సిటీలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అరుణ సోమవారం విడుదల చేశారు. తమ కళాశాలకు స్వయంప్రతిపత్తి పొందిన అనంతరం మొదటిసారిగా ఈ ఫలితాలను విడుదల చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్ వెల్లడించారు. ఈ ఫలితాలను బోధన్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వర ప్రసాద్, సీవోఈ డీకే రాజు, ఏసీఏవోఈ బాబూరావ్, ప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మెండోరా విద్యార్థులు

డీఈవో అశోక్ నుంచి బహుమతి అందుకుంటున్న మెండోరా విద్యార్థులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 10: జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టులో మండలంలోని మెండోరా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హర్షిత, హసిని సత్తా చాటారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ పాఠశాలలో జిల్లాస్థాయి ఫిజికల్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వంద మంది విద్యార్థులు హాజరయ్యారని పాఠశాల ఫిజికల్ టీచర్ గంగామోహన్ తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన హర్షిత ప్రథమ స్థానం, హసిని ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. విజయం సాధించిన వారికి డీఈవో అశోక్ చేతుల మీదుగా జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు త్వరలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. గెలుపొందిన వారిని గ్రామస్తులు అభినందించారు.

స్పందించారు.. వాహనాలను బయటికి తీశారు

- చెత్తలో, మట్టిలో ఉన్న వాహనాలు బయటికి తీయించిన ఎక్సైజ్ అధికారులు

వరుసక్రమంలో ఉంచిన వాహనాలు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 10: 'మట్టిలో కూరుకుపోతున్న వాహనాలు' శీర్షికన 'నమస్తేతెలంగాణ'లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో పలు కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన పలు వాహనాలు మట్టిలో కూరుకుపోయి శిథిలావస్థక చేరుతున్నాయని దిన పత్రికలో ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం ఆవరణలోని వాహనాలను మట్టి, పిచ్చి మొక్కల మధ్యనుంచి తొలగించి వరుస క్రమంలో ఉంచారు. అయినా.. ఈ వాహనాలకు జాప్యం లేకుండా వేలం వేయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశాలుంటాయని పలువురు పేర్కొంటున్నారు.

సమాన పనికి సమాన వేతనం అందజేయాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీయూఐసీ నాయకులు

భీమ్‌గల్, ఫిబ్రవరి 10: కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం అందజేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు బి.మల్లేశ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుమేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్‌లోని తప్పులను సరిచేయాలని, ఈఎస్ఐ ద్వారా కార్మికులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమేశ్, రాజేశ్వర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

చదువు ఇష్టం లేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కల్లెం అభిషేక్(ఫైల్)

నవీపేట, ఫిబ్రవరి 10: చదువుపై ఇష్టం లేక ఓ విద్యార్థి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. స్థానిక ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బాపూర్(బి) గ్రామానికి చెందిన కల్లెం అభిషేక్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. గతేడాది ఇంటర్ ఫస్టియర్‌లో ఫేయిల్ కావడంతో తల్లిదండ్రులు మళ్లీ ఫస్టియర్ లో చేర్పించారు. తనకు చదువు ఇష్టం లేదని స్నేహితులతో చెబుతూ తరుచూ బాధపడుతుండే వాడు. జనవరి 27న తెల్లవారు జామున పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈనెల 7 జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఫిబ్రవరి 9న తన పుట్టిన కాగా ఈ రోజే మృతి చెందడంపై కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి కల్లెం సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరద కెనాల్‌లో పడి ఒకరి మృతి

బాల్కొండ, ఫిబ్రవరి 10: మండలంలోని బస్సాపూర్ గ్రామంలో మేస్త్రీ పని చేస్తున్న ఛత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన వీర్ సింగ్ (36) ఎస్సారెస్పీ వరద కెనాల్‌లో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఠాకూర్‌సింగ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. వీర్‌సింగ్ ఆదివారం సాయంత్రం నాలుగున్నరకు ఎస్సారెస్పీ వరద కెనాల్‌లో ప్రమాదవశాత్తు జారి పడిపోగా సోమవారం మృతదేహం లభ్యమైంది. మృతుడు షార్ట్‌కట్ రూట్లో బస్సాపూర్‌కు వెళ్లేందుకు లక్ష్మి కాలువ సైడ్‌గ్రిల్ వాల్ నుంచి వెళ్తుండగా కాలు జారి ఎస్సారెస్పీ వరదకెనాల్‌లో పడిపోయి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు మాన్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్మూర్‌లో త్రిపుర గవర్నర్ పర్యటన

పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రాసేనారెడ్డి

మాక్లూర్/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి10: మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి గ్రామంలోని అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధేశ్వర శివాలయంలో త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి సోమవారం పూజలు నిర్వహించారు. అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అమృతలతారెడ్డి, వేద పండితులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఆలయ సమీపంలో పోలీసుల గౌరవవందనం స్వీకరించారు.

నేడు కందకుర్తికి త్రిపుర గవర్నర్ రాక

రెంజల్, ఫిబ్రవరి 10: ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ్ బలిరాం హేడ్గేవార్ జన్మించిన కందకుర్తి గ్రామానికి మంగళవారం త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి రానున్నారు. హెడ్గేవార్ పూర్వికుల స్థలంలో నిర్మాణంలో ఉన్న స్మృతి మందిరం పనులను పరిశీలిస్తారు. రామాలయాన్ని దర్శించుకోనున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

పూజలు నిర్వహిస్తున్న విశ్వకర్మ కులస్తులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 10: బోధన్ పట్టణం సరస్వతీ నగర్‌లోని విశ్వకర్మ భవనంలో సోమవారం విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ కత్రోజు నాగేంద్రచారి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమాలకు పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ప్రభాకర్‌చారి, సంఘ వ్యవస్థాకుడు రాందాస్ చారి, శ్రీ చక్రేశ్వర శివమందిరం చైర్మన్ సుంకోజు హరికాంత్ చారి, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు తంగళ్లపల్లి శ్రీనివాస్, మనుమయ సంఘం ప్రధాన కార్యదర్శి గంజిగామ లక్ష్మణ్‌చారి, పలు సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాలకు వేలం

మోర్తాడ్, ఫిబ్రవరి 10: ఈనెల 12న ఉదయం 11 గంటలకు మోర్తాడ్‌లోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద రెండు ద్విచక్రవాహనాలకు వేలం వేస్తామని ఎక్సైజ్ సీఐ గుండప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఉన్నవారు 25 శాతం దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Bheemgal Branch, Dist. Nizamabad agreed to accord Loan to **Borrower: Bhukya Prakash S/o Nandya, Age 45 Yrs, Occ:Business, R/o H.No.8-56/1, Rupla thanda, Bada Bheemgal (V), Bheemgal (M), Nizamabad (Dist)** on mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be Waived and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.

Hence this notice

SCHEDULE PROPERTY

The Open Plot No.10 lies in Sy No. 429 admeasuring 218.60 Sq.Yds or 182.84 Sq.Mtrs property situated at Bada Bheemgal (V), of Bheemgal Mandal, Nizamabad District Grama panchayat Bada Bheemgal, Mandal Parishad Bheemgal Zilla Parishad Nizamabad within the limits of Regn.Sub Dist Bheemgal and Regn.Dist Nizamabad,

Bounded as below : **North:** Plot No.9 **South:** Open land of Mulugu Ganesh, **East:** 1-6 wide open place of vendor, **West :** 24`-0" wide road

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhashnagar, Nizamabad, Cell:9848094409

కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్, ఫిబ్రవరి 10: మండలంలోని పడిగెల్ జీసస్ క్రైస్ట్ ప్రేయర్ ఏజీ చర్చిలో సోమవారం పాస్టర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాస్టర్ నోవా జాన్కంపటే, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ రవి పాల్ వేల్పూర్, కార్యదర్శిగా పాస్టర్ ఐసక్, అంక్సాపూర్, సహాయ కార్యదర్శిగా పాస్టర్ లాజర్, కొత్తపల్లి, కోశాధికారి పాస్టర్ చిట్టిబాబు, అంక్సాపూర్, సలహాదారులుగా పాస్టర్ కుమార్, ప్రేమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శ్రీ చక్రేశ్వర శివమందిర ఈవోగా రాములు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 10: బోధన్‌లోని శ్రీ చక్రేశ్వర శివమందిరం కార్యనిర్వాహణాధికారిగా సోమవారం రాములు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో బోధన చక్రేశ్వర శివమందిరంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి, ఉద్యోగోన్నతిలో భాగంగా సుమారు ఆరు నెలల క్రితం నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. తిరిగి ఆయనను బోధన్ చక్రేశ్వర ఆలయ ఈవోగా నియమిస్తూ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విధుల్లో చేరారు. బోధన్ ఈవోగా పనిచేసిన శ్రీరాం రవీందర్ గుప్తా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కామారెడ్డి, ఫిబ్రవరి 10 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టే